ప్రజాశక్తి
ఆదివారం 2 జూన్ 2024 5
అనంతపురం







సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఎగ్జిట్ పోల్స్‌లోనూ

ఎవరి అంచనాలు వారివే..!

- కొన్ని సంస్థలు కూటమి... మరికొన్ని వైసిపికి అనుకూలం
- అభ్యర్థుల్లో పెరుగుతున్న టెన్షన్
- బెట్టింగ్ జూదరుల్లో గుబులు





ఎన్నికల్లో గెలుపోటములపై ఎగ్జిట్ పోల్స్ అంచనాలోనూ ఎవరి లెక్కలు వారివే అన్న చందంగా మారింది. కొన్ని సర్వే సంస్థలు కూటమి అధికారంలోకి వస్తుందని ప్రకటించగా, మరికొన్ని సంస్థలు అధికార వైసిపికి అనుకూలమని ప్రకటించాయి. ఈ రెండింటి మధ్య ఎవరి అంచనాలు సరైనవన్నది భావించే పరిస్థితుల్లో సామాన్యులున్నారు. జిల్లాలో గతం కంటే టిడిపికి కొన్ని స్థానాలు పెరిగే సూచనలు కనిపిస్తున్నట్టు రెండు వైపుల అనుకూల సర్వేల్లోనూ కనిపిస్తుండటం గమనార్హం. వైసిపి అనుకూలంగా వచ్చిన ఎగ్జిట్ పోల్స్‌లో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసిపి గెలుపొందుతుందని చెబుతుండగా, ఐదింటిలో టిడిపి గెలుస్తుంది.రెండింటిలో టఫ్ ఫైట్ అని ప్రకటించారు. అదే టిడిపి అనుకూల సర్వేలో ఎనిమిది నుంచి పది స్థానాల వరకు టిడిపి వచ్చే అవకాశముందని ప్రకటించాయి. రెండు విధాలుగా చూసుకుంటే చెరి సగం స్థానాల వరకు గెలుపొందే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంటు స్థానాలున్నాయి. ఇందులో 2019 ఎన్నికల్లో 12 స్థానాల్లో వైసిపి, రెండు స్థానాల్లోనే టిడిపి గెలుపొందింది. గెలుపొందిన రెండు స్థానాలు ఉరవకొండ, హిందూపురం ఉన్నాయి. ఈసారి ఈరెండు స్థానాల్లోనూ టిడిపి గెలుపొందుతుందని సర్వేల్లో పేర్కొంటున్నారు. ఇకపోతే తాజా మాజీ మంత్రి ఉషచరణ్ శ్రీ గతంలో కళ్యాణదుర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తే ఈసారి పెనుకొండ నుంచి పోటీ చేశారు. ఈమెకు ఓటమి అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని రెండు సర్వేల్లోనూ తెలిసింది. మరో తాజా మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం ఎన్నికల సమయంలో వైసిపిని వీడి టిడిపిలో చేరారు. అయితే ఆయనకు కూడా ఓటమి తప్పదనే విధంగానే ఎగ్జిట్‌పోల్స్ ఉన్నాయి. ఇక హిందూపురం ఎమ్మెల్యేగా బాలకృష్ణ మూడవసారి విజయం సాధిస్తారని రెండు సర్వేల్లోనూ వచ్చింది. ఈ రకంగా జిల్లాలో గతం కంటే ఈసారి టిడిపికి స్థానాలు పెరిగే అవకాశాలు మాత్రం కనిపిస్తున్నాయి. వైసిపి కొన్ని స్థానాలను కోల్పోనున్నట్టు రెండు వైపుల సర్వేలు చెబుతున్నాయి.

బెట్టింగ్ జూదరుల్లో గుబులు

సర్వేలు కొన్ని అనుకూలంగా, మరికొన్నింటిలో ప్రతికూలంగా రావడంతో బెట్టిజూదరుల్లో ఎక్కడాలేని గుబులు నెలకొంది. తాము పందెం కాసినట్టు అనుకూలంగా జరుగుతుందా లేదా అన్నది తేల్చుకోలేని గందరగోళంలో పడ్డారు. ఎన్నికల ఫలితాలకు ముందు వచ్చే ఈ సర్వే రిపోర్టులతోనైనా ఒక నిర్ధిష్టత వస్తుందని ఆశించారు. కాని సర్వే సంస్థలు ఒక్కోటి, ఒక్కో రకంగా ఇవ్వడంతో ఏది కరెక్టు అన్నది తేల్చుకోలేని విధంగా మారింది. అసలైన ఫలితాలొచ్చే వరకు వారిలో టెన్షన్ తప్పేలా లేదు. జూన్ నాలుగో తేదిన వచ్చే ఫలితాల కోసం ఎదరు చూడక తప్పని పరిస్థితి నెలకొంటోంది.



అందరూ సహకరిస్తే

సజావుగా కౌంటింగ్

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. శనివారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సాధారణ ఎన్నికలు - 2024పై అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం కౌంటింగ్ కోసం అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల కౌంటింగ్ కోసం జేఎన్టీయూలో పార్లమెంట్ నియోజకవర్గం మరియు 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జూన్ 4వ తేదీన ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. కౌంటింగ్ కు ఒక గంట ముందు స్ట్రాంగ్ రూమ్‌లను తెరుస్తామన్నారు. ఓట్ల లెక్కింపులో మొదట పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కించడం జరుగుతుందని, అనంతరం 30 నిమిషాల తర్వాత ఈవీఎం కౌంటింగ్ మొదలవుతుందని తెలిపారు. 4వ తేదీ ఏజెంట్లంతా ఉదయం 7 గంటలలోపు కౌంటింగ్ హాల్ లోపల ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల అధికార యంత్రాంగంపై నమ్మకం ఉంచాలన్నారు. కౌంటింగ్ అనంతరం ఈవీఎంలను గోడౌన్‌లో భద్రపరచాల్సి ఉందని, అందులో అందరి భాగస్వామ్యం ఉందని, అందరూ సహకరించాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, పార్లమెంటరీ నియోజకవర్గం ఏఆర్ఓ రమేష్ రెడ్డి, నోడల్ అధికారి నరసింహారావుతో పాటు వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయండి

అనంతపురం రేంజ్ డిఐజి, ఎస్పీ

ప్రజాశక్తి -అనంతపురం క్రైం



జెఎన్‌టియులో స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పరిశీలన చేస్తున్న డిఐజి, ఎస్పీ

కౌంటింగ్ రోజున జిల్లాను ప్రశాంతంగా ఉంచడమే లక్ష్యంగా సమిష్టిగా శ్రమించి అంకితభావం, చిత్తశుద్ధితో పని చేయాలని అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోసీ, జిల్లా ఎస్పీ గౌతమిశాలి పిలుపునిచ్చారు. కౌంటింగ్ జరిగే అనంతపురం జెఎన్టీయు, పరిసరాలను డిఐజి, ఎస్పీలు శనివారం పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు మొదలు సమస్యాత్మక గ్రామాలు, కాలనీల్లోని పికెట్లు, మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ , క్విక్ రెస్పాన్స్ టీంలు ఇలా అన్ని విభాగాలు ఎగ్జిట్ పోల్స్ వెలువడనున్న నేపథ్యంలో ఎలాంటి అల్లర్లు జరుగకుండా ముందస్తుగానే శనివారం నుండే విధుల్లో నిమగ్నమయ్యారు. ఏవైనా అల్లర్లు, గొడవలు జరిగి భారీగా జనాలు గుమిగూడిన సందర్భాలలో సద్దుమణచడంలో భాగంగా పోలీసు సిబ్బంది స్టోన్ గార్డులు, బాడీ ప్రొటెక్టర్స్, హెల్మెట్లు, లాఠీలు, రోప్ లు, డ్రాగన్ లైట్లు దగ్గర ఉంచుకుని విధుల్లో పాల్గొన్నారు. అధునాతన ఆయుధాలు ధరించిన కేంద్ర, రాష్ట్ర, జిల్లా పోలీసు బలగాలు మరియు వజ్ర, వాటర్ కేనన్ వాహనాలు సిద్ధంగా ఉంచుకున్నారు. అంతేకాకుండా జనాన్ని చెదరగొట్టడం కోసం మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ వాహనాలకు సైరన్ తో పాటు పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టంను ఏర్పాటు చేసుకున్నారు. శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడే పరిస్థితులు, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగే సందర్భాలు, అల్లర్లు గొడవలు హింసాత్మక ఘటనల సమయాలలో పరిస్థితులను అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు వినియోగించే గ్యాస్ గన్లు, యాంటీ రైట్ గన్ లు, ప్లాస్టిక్ పిల్లెట్స్, బాలిస్టిక్ క్యాట్రిడ్జిలు కూడా రిహార్సల్స్ సందర్భంగా సిద్ధంగా ఉంచుకున్నారు



పంచాయతీ డివిజనల్ అధికారిణి సుమన్ జయంతికి వినతిపత్రం సమర్పిస్తున్న పంచాయతీ కార్మికులు

త్వరితగతిన పన్నులు వసూలు చేయాలి

పంచాయతీ డివిజనల్ అధికారిణి సుమన్ జయంతి

ప్రజాశక్తి-నార్పల

మేజర్ పంచాయతీలో వివిధ రకాల పన్నులను త్వరితగతిన వసూలు చేయాలని పంచాయతీ డివిజనల్ అధికారిణి సుమన్‌జయంతి సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కార్యాలయంలోని పలు రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మేజర్ పంచాయతీలో ఇంతవరకూ ఇంటి పన్నులు, కొళాయి పన్నులు, అంగడి లైసెన్స్ పన్నులు ఎన్ని వసూలయ్యాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నార్పల మేజర్ పంచాయతీ మంచి వ్యాపార సముదాయం కలిగిన ప్రాంతం అన్నారు. ఇక్కడ పంచాయతీకి మంచి ఆదాయ మార్గాలు ఉన్నాయన్నారు. వాటిని అధికారులు సక్రమంగా వినియోగించుకుని పంచాయితీ ఆదాయానికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్ శైలజారాణి, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మేంద్రకుమార్, మండలంలోని పంచాయతీల కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు బాలాజీనాయక్ ఆధర్వంలో డిఎల్‌పిఒ సుమన్ జయంతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి తపాల శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు కడపల నారాయణస్వామి, సాకే ఆంజనేయులు, కుళ్లాయప్ప, కంప్యూటర్ రాజారెడ్డి, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సమాయత్తం అవుదాం

జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-ఉరవకొండ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ఖరీఫ్ సాగుకు రైతులందరం సమాయత్తం అవుదాం అంటూ జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ పిలుపునిచ్చారు. 'ఖరీఫ్ సాగుకు సమాయత్తం అవుదాం' కార్యక్రమంలో భాగంగా శనివారం ఉరవకొండ మండల పరిషత్ కార్యాలయంలోని సభా భవనంలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలకు మేరకు ప్రతి మండలంలో ఈ కార్యక్రమం నిర్వహించి ఖరీఫ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో ఏ ఏ గ్రామాల్లో ఏఏ పంట సాగు అయిందో వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఫర్టిలైజర్ వివరాలను అడిగి తెలుసుకుని రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పవడంతోపాటు సలహాలు, సూచనలు ఇచ్చారు. విత్తనం మోతాదులతోపాటు ఎరువుల మోతాదులను రైతులకు వివరించారు. పురుగు మందులు, తెగుళ్ల, వాటి ఆవశ్యకత గురించి కూలంకషంగా రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌సి ఎడిఎ శైలజ, ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ, కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం ఎఒ మల్లికార్జున, మండల వ్యవసాయ అధికారి శుభకర్, ఆర్‌బికె సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



వైన్ షాప్ సిబ్బందితో వాదిస్తున్న గ్రామీణులు

ఎక్సైజ్ అధికారుల

వింత పోకడ..!

ఫోన్ పే మాత్రమే.. నగదు వద్దు.. నగరంలో షాపుకో నిబంధన మండిపడుతున్న మద్యంప్రియులు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సాధారణంగా మద్యం దుకాణాల్లో డిజిటల్ పేమెంట్లు లేవని గత ఐదేళ్లగా ప్రతిపక్షాలు గోల పెడుతున్నాయి. కానీ ప్రభుత్వం మాత్రం తాము డిజిటల్ పేమెంట్ల రూపంలో, నగదు రూపంలో సైతం మద్యం అమ్మకాలు సాగిస్తున్నామని వాదిస్తూ వస్తోంది. అయితే ఇన్ని రోజులూ డిజిటల్ పేమెంట్లు చెల్లుతాయని ప్రభుత్వం వాదిస్తున్నప్పటికీ సర్వర్ పని చేయడం లేదన్న సాకుతో కేవలం నగదు అమ్మకాలు మాత్రమే సాగించారు. కానీ శనివారం నగరంలోని కొన్ని మద్యం షాపుల్లో సరికొత్త నిబంధనలు అమలు చేయడంతో మద్యం ప్రియులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివరాల మేరకు.. అనంతపురం సర్కిల్ పరిధిలోని నగరంలోనూ కూడేరు, ఆత్మకూరు కలిపి 37 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈనెల 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 3, 4 తేదీల్లో మద్యం షాపులు బంద్ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఆది, సోమ, మంగళవారాలకు సరిపడా మద్యాన్ని తీసుకుని వెళ్లాలని నగరం చుట్టుపక్కల గ్రామాల నుంచి మద్యంప్రియులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అయితే ఎక్సైజ్ అధికారులు కొన్ని మద్యం షాపుల్లో నగదు చెల్లింపులు నిలిపివేశామని, కేవలం ఫోన్ పే మాత్రమే చెల్లుతుందని చెప్పడంతో మద్యం ప్రియులు ఖంగుతిన్నారు. చేసేది లేక షాపుల వద్ద, చుట్టుపక్కల ఉన్న ప్రతి ఒక్కరి వద్దకూ వెళ్లి 'అయ్యా నగదు ఇస్తాం.. మా నెంబరుకు ఫోన్ పే వెయ్యండి' అంటూ ప్రాధేయపడటం కనిపించింది. అయితే అన్ని షాపుల్లోనూ ఒకే విధానం అవలంబించారా.. అంటే అదీ లేదు. బళ్లారి బైపాస్ లో ఉన్న కొన్నిషాపుల్లో ఈ విధానాన్ని అమలు చేయగా సమీపంలోని కళ్యాణదుర్గం బైపాస్‌లో ఉన్న షాపుల్లో నగదు, డిజిటల్ పేమెంట్ రెండూ అమలు చేశారు. ఈ విషయమై ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా బేవరీజస్ కార్పొరేషన్ ఎవరితో అయితే ఒప్పందం చేసుకుంటే దాని ద్వారానే పేమెంట్లు ఉంటాయని సమాధానం ఇవ్వడం గమనార్హం. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకుని ఆదివారం రోజైనా ఈ నిబంధనను తొలగించాలని మద్యం ప్రియులు కోరుతున్నారు.

గొడవలకు పాల్పడితే చర్యలు

అదనపు ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ విజయ భాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంతకల్లు

ఎన్నికల కౌంటింగ్ రోజున ఏచిన్న గొడవకు పాల్పడినా, చట్ట వ్యతిరేకంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి హెచ్చరించారు. ఎస్పీ గౌతమిశాలి ఆదేశాల మేరకు శనివారం గుంతకల్లు అర్బన్, రూరల్ పరిధిలోని పోలీసులకు ఎన్నికల కౌంటింగ్ రోజున తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతకల్లు నియోజకవర్గంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం నలుగురి కంటే ఎక్కువ గుమిగూడటం నిషేధం అన్నారు. అదేవిధంగా 30 పోలీస్ యాక్టు అమల్లో ఉందని, రాజకీయ పార్టీలు పోలీసుల ముందస్తు అనుమతి లేనిదే ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నప్పుడు కానీ, తర్వాత గానీ ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు చేయరాదన్నారు. అల్లర్లు, గొడవలకు దిగితే చట్టపరిధిలో గట్టిగా బుద్ధి చెబుతామన్నారు. ఎన్నికల కౌంటింగ్ రోజున పట్టణంలో అన్ని చోట్లా మద్యం అమ్మకాలు నిషేధించినట్లు తెలిపారు. ఫలితాల రోజున అన్ని పార్టీలు వారు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. పట్టణంలో డీజేలు, మైక్‌లు, తప్పెట్లతో ఊరేగింపులకు ఎలాంటి అనుమతులు ఉండవన్నారు. ప్రస్తుతం గుంతకల్లులో ప్రశాంత పరిస్థితులు ఉన్నాయని, ఇదే ప్రశాంతతను కొనసాగించేందుకు అన్నివర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత అనవసరంగా రోడ్లపైకి వచ్చి గొడవల్లో ఇరుక్కుని బంగారు భవితను నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం ఎన్నికల ఫలితాలు రోజున మొబైల్ పార్టీలు, క్యూఆర్టీమ్, రక్షక్ టీమ్‌లు, బ్లూ కోల్ట్ టీమ్‌లు ఏవిధంగా స్పందించాలో రిహార్సల్ చేయించారు. ఈ సమావేశంలో సీఐలు రామసుబ్బయ్య, గణేష్, మహేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐలు సురేష్, దుగ్గిరెడ్డి, రంగస్వామి, స్పెషల్ పార్టీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెంట్లు 'అనంత'లో ఉండటానికి అనుమతివ్వండి


టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాకేంద్రంలో సాధారణ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలు ఉండటం వల్ల ఒకరోజు ముందు ఏజెంట్లు అనంతపురంలో ఉండేందుకు అనుమతి ఇవ్వాలని టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడుయాదవ్ కోరారు. ఈమేరకు శనివారం నగరంలో కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. ఎన్నికల ఫలితాల రోజు ఉదయం 6 గంటలకే హాజరుకావాల్సి ఉందన్నారు. అయితే దూర ప్రాంతాల్లో ఉన్న ఏజెంట్లు ఆ సమయానికి చేరుకోలేదరన్నారు. కావున ఒకరోజు ముందే నగరానికి చేరుకునేందుకు తగిన అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ కౌంటింగ్ ఏజెంట్లు ఒకరోజు ముందు నగరంలో ఉండడానికి అనుమతి ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే అవసరమైనప్పుడు ఐడి కార్డులు చూపించే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు తిరుపతినాయుడు, రాష్ట్ర కురుబ సాధికారిత సమితి డైరెక్టర్ కురుబ నారాయణస్వామి, యువత నాయకులు రాజు, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

విషజ్వరంతో చిన్నారి మృతి

ప్రజాశక్తి-పరిగి



మృతి చెందిన చిన్నారి అనిరుద్ సాయి(ఫైల్ ఫొటో)

శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండల పరిధిలోని మోదా పంచాయతీ ఆనందపాల్యంలో ఆరేళ్లే బాలుడు విషజ్వరంతో శనివారం మరణించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు ఆనందపాల్యంకు చెందిన అనిరుద్ సాయి(6) గత కొద్ది రోజులుగా బాలుడు జ్వరంతో బాధపడుతున్నాడు. హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అక్కడ నయం కాకపోవడంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని బార్పిస్ట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ బాలుడు మరణించినట్లు వైద్యులు తెలిపారు. విషజ్వరంతో బాలుడు మరణించిన విషయం తెలుసుకున్న పిహెచ్‌సి వైద్యులు స్వరూప రెడ్డి, పర్యవేక్షకులు వన్నప్ప ఆనందపాళ్యం గ్రామంలో పర్యటించారు. చిన్నారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. గ్రామంలో మలేరియా, డెంగ్యూపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కాగా ఇటీవల కురిసిన వర్షాలకు వాతావరణం మారడంతో గ్రామీణ ప్రాంతాల్లో విష జ్వరాలు ప్రబలి చిన్నారులు ఆసుపత్రుల పాలు అవుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.

శాస్త్రీయ విజ్ఞానంతోనే సమాజాభివృద్ధి

జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎం.రంగన్న

ప్రజాశక్తి-గుత్తి

ప్రతి ఒక్కరూ శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎం.రంగన్న సూచించారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహం ఎదురుగా జెవివి సభ్యత్వానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ సమాజ నిర్మాణం, ప్రగతి, దేశస్వాలంబన కోసం జెవివి పాటుపడుతోందన్నారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా విద్యార్థుల అభివృద్ధి, ఆరోగ్యం కోసం కృషి చేస్తున్నట్లు వివరించారు. కావున ప్రజలు జెవివి సభ్యత్వం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు పి.వెంకటరామిరెడ్డి, నాయకులు దేశాయి నాగరాజు, ఎ.రామాంజనేయులు, గురుశంకర్, సీతానందా, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ పోస్టర్లను విడుదల చేస్తున్న జెవివి నాయకులు

కవ్వింపు చర్యలకు పాల్పడితే చర్యలు

జిల్లావ్యాప్తంగా తనిఖీలు, కార్డెన్‌సెర్చ్‌లు

ప్రజాశక్తి-రాయదుర్గం

సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అల్లర్లు, గొడవలు, కవ్వింపు చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు హెచ్చరించారు. ఎస్పీ గౌతమిశాలి ఆదేశాల మేరకు శనివారం మండలంలోని వడ్రవన్నూరు గ్రామంలో పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని రౌడీషీటర్లు, పాత కేసుల్లోని నిందితుల ఇళ్లల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. పశువుల పాకలు, వామిదొడ్లు, తదితర ప్రదేశాలను జల్లెడ పట్టారు. అనంతరం గ్రామంలోని ప్రధాన రహదారులు, కాలనీల్లో కవాతు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజం అన్నారు. అయితే ఆ ప్రభావం గ్రామంపై పడకుండా అందరూ సంయమనంతో మెలగాలని సూచించారు. ఈకార్యక్రమంలో రాయదుర్గం పోలీస్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు, బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాల్ ఎస్‌ఐలు, రాయదుర్గం రూరల్ సర్కిల్ పోలీసులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : ఎన్నికల ఫలితాల నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని కళ్యాణదుర్గం డీఎస్పీ పి.శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామంలో పలువురు నాయకుల ఇళ్లల్లో సోదాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్నారు. అంతేగాకుండా ఓటమి, గెలుపును సమానంగా తీసుకుని శాంతియుత వాతావరణానికి సహకరించాలని కోరారు. గ్రామాల్లో కక్షలు పెంచుకుంటే కుటుంబాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ హరినాథ్, ఎస్ఐ పరశురాం, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి గొడవలు, ఘర్షణలు ప్రశాంతంగా ఉండాలని సిఐ రోషన్ సూచించారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో గ్రామాల్లో ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో మైక్ ద్వారా ప్రశాంతంగా ఉండాలని ప్రచారం చేశారు. ముఖ్యంగా ఫ్యాక్షన్ గ్రామాల్లో అదనపు బలగాలతో ఇప్పటికే మోహరించి శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నార్పల : సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మండలంలో ఎవరైనా గొడవలు, కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సోమవారం సాయంత్రం నుంచే మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులోకి వస్తుందన్నారు. కావున ఎక్కడా గుంపులుగా జనాలు గుమికూడారాదన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. వ్యాపార సముదాయాలను యథావిధిగా తెరుచుకోవచ్చన్నారు. అయితే దుకాణాలు, హోటళ్ల వద్ద నలుగురు కంటే ఎక్కువ మంది ఉండరాదన్నారు.

పుట్లూరు : కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హేమాద్రి శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జయాపజయాలు మన చేతుల్లో ఉండవన్నారు. ప్రజాతీర్పును ప్రతి ఒక్కరూ గౌరవిస్తూ సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. సోమవారం సాయంత్రం నుంచే మండల వ్యాప్తంగా డ్రోన్ కెమెరాలతో పాటు సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. వీటికితోడు పోలీస్ 30 యాక్ట్‌తోపాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని సీఐ సుబ్రమణ్యం సూచించారు. ఎస్ఐ హేమాద్రి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం పుట్లూరులో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. అలా కాకుండా గొడవ లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో ఎస్ఐ బి.నబిరసూల్ ఆధ్వర్యంలో శనివారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా అనుమానితుల ఇళ్లను సోదా చేశారు. అనంతరం గ్రామసభ నిర్వహించి కౌంటింగ్ సందర్భంగా గ్రామస్తులు ఎలాంటి అల్లర్లకు పాల్పడరాదని చెప్పారు. గొడవలు దిగితే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.


పెద్దవడుగూరు మండలంలో గడ్డివాముల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు


రాయదుర్గంలో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ బి.శ్రీనివాసులు


కళ్యాణదుర్గం పరిధిలో సోదాలు చేస్తున్న పోలీసులు

పోలీసుల కనుసన్నల్లో జెఎన్‌టియు

పరిసర ప్రాంతాల్లో కలియతిరిగిన ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సాధారణ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఇవిఎంలను భద్రపరిచిన జెఎన్‌టియు, పరిసర ప్రాంతాలు పోలీసుల కనుసన్నల్లో ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో స్వయానా ఎస్పీ గౌతమిశాలి కలియ తిరుగుతూ జల్లెడ పడ్డారు. ఇందులో భాగంగా పటిష్టంగా కొనసాగుతోన్న భద్రతతో పాటు ఆ ప్రాంగణం లోపల, వెలుపల ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, బందోబస్తు చర్యలను ఎస్పీ సమీక్షించారు. ఈ రెండు కళాశాలల ప్రాంగణాల్లో కలియ తిరిగి ఇప్పటికే ఏర్పాటు చేసుకున్న పార్కింగ్ స్థలాలను పరిశీలించి మెరుగైన చర్యల కోసం అధికారులకు పలు సూచనలు చేశారు. జెఎన్‌టియులోకి వెళ్లొచ్చేందుకు ఎంట్రీ, ఎగ్జిట్ దారులు మినహాయించి మిగితా మార్గాలేవీ లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దీనివల్ల ఎన్నికల అధికారుల అనుమతి ఉన్నవారు మాత్రమే పోలీసుల తనిఖీల గుండా కౌంటింగు కేంద్రాల్లోకి వెళ్లొచ్చేలా చర్యలు తీసుకున్నారు. ప్రహరీకి రెండువైపులా రాళ్లు, కట్టెలు లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. నిర్దేశించిన ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల ద్వారా కాకుండా ఎట్టి పరిస్థితుల్లో ప్రహరీ దూకి ఎవరూ రాకుండా నిరంతర పహారాతోపాటు ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోటీ అభ్యర్థుల వాహనాల పార్కింగ్‌ను జెఎన్‌టియులోని ఆయా కౌంటింగ్ కేంద్రాల వద్దనున్న నిర్దేశిత పార్కింగ్ స్థలాల్లో నిలుపుకునేలా, మిగితా కౌంటింగు ఏజెంట్ల వాహనాలను పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో పార్కింగ్ చేసేలా ఏర్పాటు చేయమని సూచించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఏ.ఆర్ డీఎస్పీలు టి.వి.వి.ప్రతాప్, మునిరాజు, సి.ఐలు రెడ్డెప్ప, క్రాంతికుమార్, ధరణీకిశోర్ పాల్గొన్నారు.


భద్రతపై సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ గౌతమిశాలి

ఓట్ల లెక్కింపుపై అవగాహన

రాయదుర్గం : రాయదుర్గంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో వివిధ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లకు ఎన్నికల లెక్కింపుపై ఎన్నికల అధికారిణి ఎస్.కరుణకుమారి అధ్యక్షతన శనివారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఓట్ల లెక్కింపులో అనుసరించాల్సిన విధి, విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో రాయదుర్గం తహశీల్దార్ చిట్టిబాబు, మున్సిపల్ కమిషనర్ పి.కిషోర్, రాయదుర్గం పోలీస్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు, వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థుల ఏజెంట్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు

బొమ్మనహాల్ : హనుమజ్జయంతిని పురస్కరించుకుని శనివారం మండలంలోని దేవరకొండ, నేమకల్లు గ్రామాల్లో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రభాతసేవ, దివ్యదర్శన విశేషాలంకరణ, హనుమాన్ వ్రతం, హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. తర్వాత కుంకుమార్చన, పాకల పూజ, వెండి కవచం, సువర్ణ కిరీటాలను అలంకరించి స్వామివారి మూలవిరాట్‌ను చిన్న రథంపై ఆశీనులను చేసి రథాన్ని లాగారు. రాయదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయం తరుపున ఉచిత అన్నదానం ఏర్పాటు చేసినట్లు అన్నదాన కమిటీ అధ్యక్షులు రామాంజనేయులు తెలిపారు.

పుట్లూరు : హనుమజ్జయంతిని పురస్కరించుకుని శనివారం మండలంలోని పుట్లూరు, తక్కల్లపల్లి, రంగినేపల్లి గ్రామాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజాము నుంచే స్వామివారికి ప్రత్యేక అలంకరణ, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

రాయదుర్గం : పట్టణంలోని జాతీయ రహదారిపై చెక్‌పోస్టు వద్ద ఉన్న అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం పంచామృతాభిషేకం, గణపతి, నవగ్రహ హోమం, రామ తారకమంత్ర హోమం, ఆంజనేయ మూలమంత్ర హోమాలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు కోదండ సత్యనారాయణ, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : హనుమజ్జయంతిని పురస్కరించుకుని శనివారం మండలవ్యాప్తంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయమే ఆయా ఆలయాల్లో అభిషేకాలు, ఆకుపూజలు, వడమాలల అర్చనలు చేశారు. ముఖ్యంగా వ్యాసరాయ స్థాపించిన పామిడి కోట వరాంజనేయ స్వామి ఆలయంలో కలశస్థాపన, నవధాన్య పూజలు, అభిషేక అర్చన, చేశారు. తర్వాత ఇల్లూరు చితంబరయ్య కుటుంబం తెచ్చిన నూతన సీతారామ నూతన విగ్రహాలకు కళ్యాణోత్సవం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం కోటి వరాంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు.

బెలుగుప్ప : మండలంలోని పలు గ్రామాల్లో ఆంజనేయ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యంగా మండలంలోని బెలుగుప్ప, తగ్గుపర్తి, నక్కలపల్లి, ఆవులెన్న, రామసాగరం సమీపంలో పెన్నా నది ఒడ్డున వెలిసిన బూదిగుమ్మ సంజీవరాయుడు స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.


పూజలందుకున్న ఆంజనేయస్వామి

రాయదుర్గం: హనుమజ్జయంతిని పురస్కరించుకుని శనివారం రాయదుర్గం కోటలో వెలిసి ఉన్న నగరేశ్వరస్వామి ఆలయంలో పంచముఖ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దవడుగూరు : మండలంలోని మల్లేనిపల్లి, ముప్పాలగుత్తి, ఆవులాంపల్లి, పెద్దవడుగూరు, కోటకొండ, దిమ్మగుడి తదితర గ్రామాల్లో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మల్లేనిపల్లిలో సంజీవరాయుడు ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం గ్రామ పురవీధుల గుండా ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

శింగనమల : మండలంలోని చెరువు కట్టమీద వెలిసిన దుర్గాఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, పాలాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో శింగనమల వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు,నాయకులు మంత్రి వీరాంజనేయులు, దిద్దుకుంట భాస్కర్‌రెడ్డి, అప్పేచెర్ల అబ్దుల్లా, బాలకృష్ణ, నాగవర్ధన్‌రెడ్డి, ఆదినారాయణ పాల్గొన్నారు.

నేడు గ్లోబల్ ఫర్నిచర్స్, ఇంటీరియర్స్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక కళ్యాణదుర్గం రోడ్డులోని రజాక్ ఫంక్షన్ హాల్ ఎదురుగా నూతనంగా నిర్మించిన గ్లోబల్ ఫర్నిచర్స్ షోరూమ్‌ను ఆదివారం ప్రారంభించనున్నట్లు సంస్థ మేనేజింగ్ పార్ట్నర్స్ మధుసూదన్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ రెండు దశాబ్దాల సుదీర్ఘ అనుభవంతో ఫర్నిచర్ రంగంలో నాణ్యత నమ్మకంతో ప్రజలకు సేవలు అందించేందుకు తాము షోరూమ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బెంగళూరులో సొంత ఉత్పత్తి కేంద్రంలో అందరికీ అందుబాటులో ఉండే విధంగా సోఫాలను తయారు చేసి అందిస్తున్నట్లు వివరించారు.



షోరూమ్ భవనం, (ఇన్‌సెట్‌లో) యజమానులు మధుసూదన్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి

తమ వద్ద సోఫాలు మంచాలు డైనింగ్ టేబుల్ సెంచురీ మేట్రస్, దీపాలు డ్రెస్సింగ్ టేబుల్, అన్ని రకాల ఫర్నిచర్స్ చైర్లు లభిస్తాయన్నారు. కస్టమర్లకు నాణ్యతతో ఏ గ్రేడ్ మెటీరియల్‌తో ఫర్నిచర్ సామగ్రిని అందజేస్తున్నట్లు చెప్పారు. తమ వద్ద 35 వేల నుంచి అడిగిన మోడల్స్‌ను అందించేందుకు ఉత్పత్తి కేంద్రంలో నిష్ణాతులైన సిబ్బంది ఉన్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి అనంతరం జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వలసలను నివారించాలి

వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి


ప్రజాశక్తి-వజ్రకరూరు

గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించి వలసలను నివారించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శనివారం కూడేరు, కడదరకుంట గ్రామాల్లో ఉపాధి కూలి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పని చేసే కూలీలకు రోజు కూలి రూ.300 ఇస్తామని ప్రభుత్వం చెప్పిన హామీ ఎక్కడా అమలు కావడం లేదన్నారు. అంతేగాకుండా పనులు చేసే చోట కనీస మౌలిక వసతులు కల్పించడం లేదన్నారు. దీంతో కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే పనిముట్లు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోజుకు రూ.300 కూలి పడేలా చూడటంతోపాటు పనులు చేసే చోట సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కె.వెంకటేష్, రాధాకృష్ణ, జగన్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


కూలీల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న వ్య.కా.సం నాయకులు

స్ట్రాంగ్ రూములను పరిశీలించిన అభ్యర్థులు

పామిడి : ఈనెల 4న ఎన్నికల ఫలితాలు రానున్న నేపథ్యంలో అనంతపురంలోని జెఎన్‌టియులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను గుంతకల్లు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరామ్ శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఇవిఎంలను భద్రపరిచిన రూముల వద్ద ఏర్పాటు చేసిన చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ బిఎస్ కృష్ణారెడ్డి, గుమ్మనూరు ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.


సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న బండారు శ్రావణిశ్రీ


సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న గుమ్మనూరు జయరామ్

పుట్లూరు : అనంతపురంలోని జెఎన్‌టియులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను శింగనమల టిడిపి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ శనివారం పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న భద్రతా సిబ్బందిని భద్రతపై ఆరాతీశారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

గుత్తి : పట్టణంలోని ఎంఎస్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వపు విద్యార్థులు తమ తోటి పూర్వపు విద్యార్థి కుటుంబానికి శనివారం ఆర్థికసాయం చేశారు. మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన సుధానంద ఇటీవల మరణించాడు. సమాచారం తెలుసుకున్న పూర్వపు విద్యార్థులు గ్రామానికి వెళ్లి స్నేహితుని కుటుంబ సభ్యులకు రూ.10వేలు, నెలకు సరిపడా నిత్యవసర వస్తువులను అందజేశారు. భవిష్యత్తులో కూడా స్నేహితుని కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.


ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వపు విద్యార్థులు

నీలం సంజీవరెడ్డికి నివాళి

ఆత్మకూరు : మాజీ రాష్ట్రపతి, మాజీ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి వర్థంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రెడ్డిసంఘం జిల్లా అధ్యక్షుడు పాటిల్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం అనంతపురంలోని నీలం సంజీవరెడ్డి సర్కిల్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతిగా దేశానికి, ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి అనేక సేవలు చేశారన్నారు. ఆయన సేవలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డిసంఘం గౌరవాధ్యక్షులు గట్టిరెడ్డి బైరెడ్డి, హనుమంతురెడ్డి, కార్యవర్గ సభ్యులు ఫైర్ కృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులు మధుసూదన్, కార్యవర్గ సభ్యులు సోమిరెడ్డి, దయ్యం హనుమంతురెడ్డి, శివరామ్‌రెడ్డి పాల్గొన్నారు.



నీలం సంజీవరెడ్డికి నివాళులర్పిస్తున్న రెడ్డిసంఘం నాయకులు

విద్యాహక్కు చట్టాన్ని పటిష్టం చేయాలి : ఎస్ఎఫ్ఐ

శింగనమల : ప్రయివేటు విద్యాసంస్థల దోపిడీలను అరికట్టి విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాష్ వనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముఖ్యంగా పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలో అధిక ధరలకు విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను పీల్చి పిప్పి చేస్తున్నారన్నారు. ముందస్తు అడ్మిషన్ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. పర్యవేక్షించాల్సిన మండల, జిల్లా విద్యాశాఖ అధికారులు నిమ్మకుండి పోయారన్నారు. నియోజకవర్గంలో ప్రయివేటు, విద్యాసంస్థలు యథేచ్ఛగా ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్నాయన్నారు. కొంతమంది పాఠశాలలను వ్యాపారంగా మార్చారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఫీజులు నియంత్రణ చట్టం తీసుకురావాలని, అధిక ఫీజులను అరికట్టాలని, విద్యాహక్కు చట్టాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

నేరాలు ఘోరాలు

కర్నాటక మద్యం పట్టివేత

అనంతపురం క్రైం : ఎస్పీ గౌతమిశాలి ఆదేశాల మేరకు అనంతపురం సెబ్ పోలీసులు దాడులు చేసి భారీగా కర్నాటక మద్యం పట్టుకున్నారు. సెబ్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణ పర్యవేక్షణలో అనంతపురం సెబ్ సి.ఐ యల్లయ్య, సిబ్బందితో కలిసి అనంతపురం టౌన్ వికలాంగుల కొట్టాలకు చెందిన దేవరకొండ చంద్ర, మాల జెన్ నుంచి 480 కర్నాటక టెట్రా పాకెట్లను సీజ్ చేశారు. అనంతరం కూడేరు మండలం మరుట్ల-2 గ్రామానికి చెందిన ఎరుకుల శివయ్య వద్ద ఆటోలో తరలిస్తున్న 14 కర్నాటక మద్యం బాక్సుల్లో 1344 టెట్రా పాకెట్లు స్వాధీనం చేసుకుని ఆటోను సీజ్ చేశారు. వీటి విలువ సుమారు రూ.1,23,120 ఉంటుందన్నారు. కూడేరు, అనంతపురం చుట్టుపక్కల అధిక ధరలకు విక్రయించడానికి అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడినట్లు సి.ఐ యల్లయ్య తెలిపారు.


మద్యం వివరాలను వెల్లడిస్తున్న సిఐ యల్లయ్య

ఆలయంలో చోరీ

పామిడి : మండల కేంద్రంలోని ప్రభుత్వ 1వ వార్డు ప్రాథమిక పాఠశాల దగ్గర ఉన్న యల్లమ్మ స్వామి ఆలయంలో శనివారం మధ్యాహ్నం గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎవరూ లేని సమయంలో అగంతకులు ఆలయంలోకి ప్రవేశించి హుండీ పగులగొట్టి దాదాపు రూ.20వేల నగదు ఎత్తుకెళ్లారని ఆలయ అర్చకురాలు మొండికాళ్ల నాగలక్ష్మి తెలిపారు.

రైల్వే కార్మికునికి గాయాలు

గుత్తి : విధి నిర్వహణలో ఉన్న ఓ రైల్వే కార్మికుడు శనివారం తీవ్రంగా గాయపడ్డాడు. బసినేపల్లి తండాకు చెందిన రంగానాయక్ స్థానిక రైల్వేడీజిల్ లోకో షెడ్‌లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇందులో భాగంగా మరమ్మతుల నిమిత్తం రైల్వే ఇంజన్ పైకి ఎక్కగా ప్రమాదవశాత్తు పక్కన ఉన్న గోడ తగిలి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన తోటి కార్మికులు క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం స్థానిక రైల్వే ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అతన్ని అదనపు చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ముగియనున్న నిరీక్షణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల ఫలితాల కోసం సాగుతున్న నిరీక్షణ మరో రెండు రోజుల్లో ముగియనుంది. మే 13వ తేదీన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఓటర్లు తమ తీర్పును ఇప్పటికే ఓటుతో చెప్పేశారు. ఆ తీర్పు ఎటువైపు అన్న ఉత్కంఠత మాత్రం రెండు వారాలుగా జనంలో, రాజకీయపార్టీల్లో నెలకొంది. పోలింగ్ సందర్భంగా ఓటర్లను తమ వైపు మలుచుకునేందుకు అభ్యర్థులు అనేక ప్రయత్నాలు చేశారు. డబ్బులు, మద్యం ఇలా అనేక రకాల ప్రలోభాలు కొనసాగాయి. ఓటుకు రెండు వేల కంటే ఎక్కువే జిల్లాలో పంపిణీ జరిగింది. ఇంత చేసినా పోలింగ్ బూతులోకెళ్లి ఓటరు దేనిపై మీట నొక్కాడన్న సందేహం నెలకొంది. ఈ సందేహాలతో ప్రధాన రాజకీయపార్టీలు తికమక పడుతూనే ఉన్నాయి. అభ్యర్థులు బయటకు ధీమా వ్యక్తం చేస్తున్నా...లోలోనా మాత్రం గుబులు నెలకొని ఉంది. ఇక ఈ నీరక్షణ ముగియడానికి సమయం దగ్గరపడుతోంది. ఓట్ల లెక్కింపు వచ్చే మంగళవారం జరగనుంది. దీనికి అవసరమైన ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ఎన్నికల రోజు తాడిపత్రి తదితర ప్రాంతాల్లో జరిగినట్టు ఓట్ల లెక్కింపు తరువాత జరగకుండా ఉండే విధంగా గట్టి చర్యలు తీసుకుంటున్నారు. ఈ వారంలో ఓట్ల లెక్కింపు అధికారులకు శిక్షణలు పూర్తయ్యాయి. అనంతపురం జెఎన్‌టియులో పూర్తి స్థాయి బందోబస్తు జరిగింది. ఫలితాల తరువాత ఎవరు ఎటువంటి వివాదాలకు పాల్పడినా చర్యలు తప్పవన్న హెచ్చరికలు జారీ చేశారు.

ఎగ్జిట్‌పోల్స్ కూడా శనివారం రావడంతో వాటిపైనా అనేక ఊహాగానాలు నడుస్తున్నాయి. తమకు అనుకూలంగా ఉంటే ఒక రకంగానూ, లేకపోతే మరో విధంగా స్పందిస్తున్నారు. ఇక బెట్టింగ్‌ల జోరు పెరిగింది. సమయం దగ్గర పడుతుండటంతో పందేల జోరు కొనసాగుతోంది. ఈ వారంలో వాతావరణమూ కాస్త చల్లబడింది. వర్షాలు రావడంతో జిల్లాలో అంతకు మునుపు ఉన్నంత వేడి లేదు. జిల్లా అంతటా ఒక మోస్తరు వర్షపాతం పడటంతో రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమయ్యారు. పొలాలను దుక్కులు దున్ని సిద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు ప్రభుత్వం సబ్సిడీ విత్తనం కూడా ఇస్తుండటంతో విత్తన కొనుగోళ్లు ప్రారంభమయ్యారు. ఈ మాసంలో మంచి పదునవుతే విత్తనం విత్తుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కేరళకు ఇప్పటికే నైరుతి రుతుపవనాలు తాకి ఉన్నాయి. దీంతో జిల్లాలోనూ త్వరలోనే మంచి వర్షాలు వచ్చే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. గతేడాది వర్షాభావంతో రైతులు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈసారైనా వర్షాలు సకాలంలో మంచిగా వస్తే పంట పండుతుందని ఆశిస్తున్నారు. ఇదే తరుణంలో ఎన్నికల ఫలితాల తరువాత వచ్చే కొత్త ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పట్టించుకుంటే బాగుంటుందని ఆశిస్తున్నారు. 2023 పంటల బీమా ఇప్పటికీ అందలేదు. దాన్ని మంజూరు చేయడంతోపాటు, గతేడాది వరకు ఇస్తూ ఉన్న రైతు భరోసానూ ఈసారి ఇప్పటికీ రాలేదు. ఈఎన్నికల తరువాత వచ్చే కత్త ప్రభుత్వం వీటిపై దృష్టి సారించి రైతాంగనికి తోడ్పాటునందివ్వాలని ఆశిస్తున్నారు. ఏది ఏమైనా ఈ వారంలో అటు వాతావరణంలోనూ, ఇటు రాజకీయంగానూ హడావుడి మొదలైంది. వర్షాలతో వ్యవసాయ పనులు ఊపందుకోగా, ఓట్ల లెక్కింపు సమయం దగ్గరపడటంతో అధికార యంత్రాంగం హడావుడిలో మునిగినింది.

